మంటల్లో కాలిన
రెండు కార్లు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 18: ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి రెండు కార్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదం ఆదివారం మధ్యాహ్నం ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఛత్రినాక నివాసి రఘు యాదవ్ రోజువారీ మాదిరిగానే స్థానిక శివపార్వతి ఫంక్షన్ హాల్ సమీపంలో తన రెండు కార్లను ఖాళీ స్థలంలో పార్కింగ్ చేశాడు. అయితే, ఆదివారం ఉన్నట్టుండి రెండు కార్లుకు మంటలంటుకొని కాలిపోతుండగా స్థానికులు గమనించారు. ఆ వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులు సమాచారమివ్వడంతో మొగల్‌పుర అధికారులు స్పందించి ఫైర్ ఇంజిన్‌తో వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే కార్లు పూర్తిగా కాలిపోయాయి. ఛత్రినాక ఏసీపీ రమేశ్, ఇన్‌స్పెక్టర్ బోజ్యా నాయక్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ ఘటన షార్టుసర్క్యూట్ వల్ల జరిగిందా..? లేదా ఎవరైనా ఆకతాయిలు కావాలనే చేశారా..? అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. కేసును ఛత్రినాక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చున్నీ.. చిన్నారి ఊపిరి తీసింది

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 18: ఆడుకుంటున్న చిన్నారి మెడకు చున్నీ చుట్టుకొని ఊపిరి తీసింది. ఈ ఘటన ఆదివారం పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సరేందర్ రెడ్డి కథనం ప్రకారం.. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని ఏరోనాటికల్ కాలనీలో నివాసముంటున్న గణేశ్ రాఘవేంద్రకు ముగ్గురు ఆడపిల్లలు. అతడు రెండో కూతురు మహర్షి(10) ఆదివారం మధ్యాహ్నం సమయంలో తాము ఉంటున్న బిల్డింగ్‌పై మరో చిన్నారితో కలిసి ఆడుకుంటోంది. ఈ క్రమంలో కిటికీపై ఉన్న చున్నీతో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు మెడకు చుట్టుకొని ఊపిరి ఆడక తల్లడిల్లింది. పక్కనే ఆడుకుంటున్న మరో చిన్నారి ప్రమాదాన్ని గమనించి.. వెంటనే కిందకు వెళ్లి మహర్షి తల్లితో చెప్పింది. ఆమె హుటాహుటిన పైకి వచ్చి చూడగా.. బాలిక మెడకు చున్నీ చుట్టుకొని విగతజీవిలా పడి ఉంది. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ సొమ్ము క్రిప్టోలోకి మారితే అంతే..!

మూడు రకాల నేరాల్లోనే ఎక్కువ సొమ్ము

సిటీబ్యూరో, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): సైబర్‌నేరాల్లో బాధితులు ఆయా ఖాతాల్లో డిపాజిట్ చేస్తున్న సొమ్మును నేరగాళ్లు వెంట వెంటనే వేర్వేరు ఖాతాలకు బదిలీ చేస్తూ చివరకు క్రిప్టోలోకి మార్చేస్తున్నారు. క్రిప్టోలోకి మార్చిన సొమ్ము విదేశాలకు వెళ్లిపోతోంది. ఇందులో 30 నుంచి 40 శాతం కమీషన్ల రూపంలో ఆయా ఖాతాదారులు, నిర్వాహకులు పంచుకోగా.. మిగతా 60 నుంచి 70 శాతం విదేశాలకు వెళ్తున్నట్టు పోలీసులు గుర్తించారు. క్రిప్టోలోకి మారకముందే బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయగలిగితే.. బాధితుల సొమ్ము విదేశాలకు తరలివెళ్లకుండా ఆపగలుగుతామని సైబర్‌క్రైమ్ పోలీసులు చెబుతున్నారు. సైబర్‌నేరగాళ్ల బారిన ప్రజలు పడకుండా ఉండేందుకు వారిలో అవగాహన తీసుకురావడం ఒక ఎత్తయితే.. మోసపోయిన వారి సొమ్ము విదేశాలకు తరలివెళ్లకుండా చేయడం మరో ఎత్తు.. అని పోలీసులు పేర్కొన్నారు. నేరం జరిగిందని గుర్తించిన వెంటనే బాధితులు 1930కు ఫిర్యాదు చేయడం మరవొద్దని పోలీసులు సూచిస్తున్నారు. ఎక్కువగా పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ట్రేడింగ్, ఫెడెక్స్ కొరియర్‌లో నిషేధిత వస్తువులు ఉన్నాయంటూ బెదిరిస్తున్న ఘటనల్లో బాధితులు ఎక్కువ మొత్తంలో సొమ్మును పోగొట్టుకుంటున్నారు. ఇందులో పార్ట్‌టైమ్, ట్రేడింగ్ అనేది అత్యాశతోనే జరుగుతుంది. ఎక్కువగా విద్యావంతులే మోసానికి గురువుతున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే వాళ్లు సైతం ఈజీగా సైబర్‌నేరగాళ్ల బుట్టలో పడి కోట్ల రూపాయలు పోగొట్టుకుంటున్నారు.

ట్రెండ్ మారుస్తున్న ఆర్థిక నేరగాళ్లు

అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): ఒకప్పుడు దోపిడీలు, దొంగతనాలు, దారి దోపిడీలు వంటి ఆర్థిక నేరాళ్లు జరిగేవి. ఈ క్రమంలో భౌతిక దాడులు, హత్యలు వంటివి ఘటనలు కూడా చోటు చేసుకునేవి. కానీ.. మారుతున్న కాలంతో పాటు నేరస్తులు కూడా తమ రూట్ మారుస్తున్నారు. ప్రస్తుతం డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో నేరగాళ్లు భౌతికంగా కనిపించకుండానే.. ఎదుటివారిని నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఆర్థిక నేరాల్లో ప్రజల అమాయకత్వం, ప్రధానంగా అత్యాశే ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు.

పెట్టుబడి.. రాబడి పేరుతో..

తక్కువ పెట్టుబడి పెడితే.. ఎక్కువ రాబడి వస్తుందని నమ్మిస్తూ అమాయకులను నట్టేట ముంచేస్తున్నారు. స్టాక్ మార్కెట్ల పేరిట కొందరు.. తమ కంపెనీల్లో షేర్లు పెట్టి కొంత కాలం ఆగితే అధిక రాబడి వస్తుందంటూ మరి కొందరు అమాయక ప్రజలను నమ్మిస్తారు. ఈ క్రమంలో ముందుగా అమాయకులతో తక్కువ పెట్టుబడి పెట్టించి.. తొలుత కొంత లాభాలు ఇస్తున్నారు. కొద్దిపాటి లాభాలకే ఆకర్షితులైన బాధితులు.. నమ్మకంతో లక్షల్లో పెట్టుబడి పెడతారు. సైబర్ నేరగాళ్ల చేతిలో దోపిడీకి గురవుతున్నారు. ఆ తరువాత లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

పీటూపీ ట్రాన్‌జాక్షన్ ద్వారా..

ఈ మధ్య కాలంలో సైబర్ నేరగాళ్లు తమ రూట్ మార్చుకుని కొత్త ట్రెండ్‌కు తెరలేపారు. దోచుకున్న డబ్బును పోలీసులు ఫ్రిజ్ చేయకుండా ఉండేందుకు అమాయకులను అడ్డంగా బుక్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల నగరానికి చెందిన ఒక విద్యార్థిని సైబర్ నేరగాడు అధిక లాభాల పేరుతో ట్రాప్ చేసి.. పీటూపీ ద్వారా నేర పూరితమైన డబ్బును వైట్‌గా మార్చుకుని అమాయక విద్యార్థిని ఇరికించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నేరగాడు లావాదేవీలు జరిపిన అన్ని బ్యాంక్ ఖాతాలను పోలీసులు ఫ్రీజ్ చేశారు.

పెళ్లి సంబంధాల పేరుతో..

ఈ మధ్య పెళ్లి సంబంధాల పేరుతో చాలా మంది యువతులను నేరగాళ్లు నిలువునా దోచేస్తున్నారు. కొన్ని సందర్భాలలో యువకులు కూడా మోసపోతున్నారు. మ్యాట్రిమోనీ సైట్ల ద్వారా కొందరు నేరగాళ్లు పెళ్లి సంబంధాల కోసం నిరీక్షిస్తున్న యువతులను లక్ష్యంగా చేసుకుని వారికి మారు పేర్లతో ప్రొఫైల్‌ను పంపుతున్నారు. మాయమాటలతో నమ్మించి, వలలో వేసుకొని, డబ్బులు దోచుకుంటున్నారు. మరికొందరు నేరగాళ్లు పెళ్లి సంబంధాల పేరుతో పరిచయమై వీడియోకాల్స్ మాట్లాడుతున్నారు. వాటిని స్క్రీన్ రికార్డ్‌చేయడమే కాకుండా సదరు వీడియోలను అశ్లీల దృశ్యాలుగా మార్ఫింగ్ చేసి యువతులను బ్లాక్‌మెయిల్ చేసి దోచుకుంటున్నారు.

ఉద్యోగాల పేరుతో గాలం..

నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకుని కొంత మంది నేరగాళ్లు కన్సల్టెన్సీల పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో కొత్త పద్ధతిలో నేరగాళ్లు జాబ్ ఫ్రాడ్ నేరాలకు పాల్పడుతున్నారు. తమ కంపెనీలో ఉద్యోగావకాశాలున్నట్లు నిరుద్యోగులకు మెసేజ్‌లు పంపి, మోసం చేస్తున్నారు. అమాయకులు తమ వద్ద ఉన్నంత సమర్పించుకుని లబోదిబోమంటున్నారు.

గుర్తు తెలియని వ్యక్తులను నమ్మకండి

ఈ మధ్య కాలంలో సైబర్ నేరాల ద్వారా మోసపోతున్న వారిలో ఎక్కువ శాతం విద్యావంతులే ఉండటం విచారకరం. వీరిలో కొంత మంది తెలిసీ తెలియక మోసపోతుంటే.. మరికొందరు అత్యాశతో మోసపోతున్నారు. ముఖ్యంగా ఏదైనా కంపెనీలో పెట్టుబడులు పెట్టాలంటే.. ముందుగా ఆ కంపెనీ గురించి పూర్తిగా తెలుసుకోవాలి. గుర్తింపు ఉన్న కంపెనీల్లో మాత్రమే పెట్టుబడి పెట్టాలి. ఆన్‌లైన్‌లో సూచించే కంపెనీల్లో పెట్టుబడులు పెట్టొద్దు. పీటూపీ ట్రాన్‌జాక్షన్స్ ద్వారా ట్రేడింగ్ చేయవద్దు. ప్రముఖ కంపెనీల ద్వారానే ట్రేడింగ్ జరపాలి. ముక్కూ.. ముఖం తెలియని వారితో పరిచయాలు ఏర్పర్చుకుని.. వారితో వీడియో కాల్స్ మాట్లాడటం ప్రమాదకరం. అలాంటి వారి బారిన పడితే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలి. నిందితులు బెదిరించినంత మాత్రాన వారికి డబ్బులు పంపకూడదు. విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకురావాలి. పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటారు. సైబర్ నేరగాళ్ల పట్ల నిరంతరం ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– శిల్పవల్లి, సైబర్‌క్రైమ్ డీసీపీ, సైబరాబాద్

మనస్తాపం.. మహిళ ఆత్మహత్య

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 18: వివాహేతర సంబంధాలు పలువురి జీవితాల్లో విషాదాన్ని నింపుతున్నాయి. ఊహించని పరిణామాలకు, దారుణాలకు కారణమవుతున్నాయి. ఇలాంటి ఘటనే ఒకటి నారాయణగూడ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అడ్మిన్ ఎస్సై నరేశ్ కుమార్ కథనం ప్రకారం.. కర్ణాటకకు చెందిన గిరీష్, శివాలి (32) దంపతులు. వీరికి ఒక కుమారుడు(11), ఒక కుమార్తె (14)ఉన్నారు. ఈ కుటుంబం జీవనోపాధి కోసం నగరానికి వచ్చి హిమాయత్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో ఆరేండ్లుగా ఇద్దరు వేర్వేరుగానే ఉంటూ జీవనం సాగిస్తున్నారు. శివాలి ఈవెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నది. ఆమెకు రెండేళ్ల కిందట బేగంపేటలోని ఓ పబ్‌లో రాంకోఠికి చెందిన ఖాలీద్ (38) పరిచయమయ్యాడు. ఆ పరిచయం వీరిద్దరి మధ్య వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఖాలీద్‌కు భార్యా పిల్లలున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న శివాలికి సహాయం చేశాడు. వీరిద్దరి మధ్య ఏర్పడిన పరిచయంతో అతడు శివాలి ఇంటికి కూడా వచ్చేవాడు. ఈ క్రమంలో ఆమె 14 ఏండ్ల కుమార్తెపై ఖాలీద్ కన్నుపడింది. తల్లి ఇంట్లోలేని సమయంలో అతడు ఇంటికి వచ్చి.. బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించి, వేధింపులకు గురి చేశాడు. ఈ విషయాన్ని బాలిక పలుమార్లు తల్లితో చెప్పింది. గొడవలు కూడా జరిగాయి. ఈ పరిస్థితులతో తీవ్ర మనస్తాపం చెందిన శివాలి శనివారం సాయంత్రం పిల్లలు బయట ఆడుకుంటుండగా.. ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని పోలీసులు భావించారు. అయితే, ఆమె కుటుంబం ఇచ్చిన సమాచారంతో పోలీసులు క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేయగా.. ఆమె ఆత్మహత్యకు వివాహేతర సంబంధం కారణంగా తేలడంతో ఖాలీద్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వెంటపడి రుణాలు - వేధించి వసూళ్లు

మనుషుల ప్రాణాలు తీస్తున్న బ్యాంకు రికవరీ ఏజెంట్లు

కీసర ఘటనపై కొనసాగుతున్న దర్యాప్తు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): అవసరాలను బట్టి బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటున్న సామాన్య ప్రజలపై కొన్ని సంస్థలు అధిక భారం వేస్తూ ప్రాణాలు తీసుకునే స్థాయికి తీసికెళ్తున్నాయి. లోన్ యాప్‌ల వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యలు ఒకపక్క జరుగుతుండగా.. మరో పక్క తాజాగా.. బ్యాంకు రికవరీ ఏజెంట్ల ఒత్తిళ్లతోనూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. తాజాగా.. కీసరలో వెలుగులోకి వచ్చిన దంపతుల ఆత్మ హత్య ఘటనతో రుణాల రికవరీలో వేధింపుల విషయం చర్చనీయాంశంగా మారింది. కొన్ని బ్యాంకులు వద్దన్నా క్రెడిట్ కార్డులు కట్టబెడుతుంటాయి. పర్సనల్ లోన్స్ ఇస్తుంటాయి. ప్రజల డేటా బేస్ మొత్తం ప్రైవేట్ ఏజెన్సీల చేతిలోకి వెళ్తుంది. ఈ వివరాలతో టెలి కాలర్స్ ప్రతి ఒక్కరినీ వేధిస్తూ లోన్ కావాలా..? క్రెడిట్ కార్డు కావాలా..? అంటూ వేధిస్తుంటారు.

ఇవ్వడం వరకే బాధ్యత..

అవసరం లేకున్నా మీకు ఈ అవకాశముందంటూ రుణాలు, క్రెడిట్ కార్డులు కట్టబెడుతూ ఆయా బ్యాంకులు తమ చేతులు దులుపుకొంటున్నాయి. ఆ తరువాత బిల్లులు, వడ్డీలకు వడ్డీలు వాయిస్తూ వినియోగదారుల నడ్డి విరుస్తున్నాయి. క్రెడిట్ కార్డు బిల్లు నిర్ణీత సమయానికి చెల్లించకుంటే, మరుసటి రోజు నుంచే జరిమానా విధిస్తుంటారు. రకరకాల పేర్లతో ఇష్టానుసారంగా బిల్లులు వేసి.. కస్టమర్ల నుంచి బలవంతంగా వసూలు చేస్తుంటారు. ఒక్క నెల చెల్లించలేదంటే.. ఇక ఆ కస్టమర్‌పై బ్యాంకు కాల్ సెంటర్లు, ప్రైవేట్ ఏజెన్సీలు ఫోన్లు చేస్తూ దండయాత్ర చేస్తారు. మరికొందరు ఒక అడుగు ముందుకేసి.. ఇండ్ల వద్దకు వెళ్లి అప్పు చెల్లిస్తావా..? లేదా..? అంటూ వేధింపులకు గురిచేస్తుంటారు. కీసరకు చెందిన రాగుల సురేశ్, భాగ్య దంపతులు రెండు బ్యాంకుల నుంచి రుణం తీసుకున్నారు. రుణం చెల్లించాలంటూ రికవరీ ఏజెంట్లు చేసిన అవమానాన్ని భరించలేక శనివారం తనువు చాలించారు. రికవరీ ఏజెంట్ల వేధింపులతోనే తాము ఆత్మహత్య చేసుకున్నామని కీసరలో ఆత్మహత్య చేసుకున్న దంపతులు సూసైడ్ నోట్ రాయడంతో ఏమి జరిగిందనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పాండురంగారావు

ట్రస్ట్ బోర్డు పేరుతో అవకతవకలు..

ఖైరతాబాద్, ఫిబ్రవరి 18 : కాచిగూడలోని మున్నూరు కాపు (కాపు) విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు పేరుతో కొందరు అవకతవకలకు పాల్పడుతున్నారని బోర్డు మేనేజింగ్ ట్రస్టీ ఆకుల పాండురంగారావు ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓ వ్యక్తి తనకు తాను చైర్మన్‌గా ప్రకటించుకొని ఇష్టారాజ్యాంగ వ్యవహరిస్తున్నారన్నారు. బైలా ప్రకారం ఐదుగురు సభ్యులు మాత్రమే ఉండాల్సి ఉండగా.. మొత్తం తొమ్మిది మందిని నియమించుకొని, ట్రస్ట్ పేరుతో మరో బ్యాంకు ఖాతాను తెరిచి నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. 1965 నుంచి ఇప్పటి వరకు ఎలాంటి మచ్చ లేకుండా ఎందరో పేద విద్యార్థులకు ఆశ్రయం కల్పిస్తున్న ఈ వసతి గృహాన్ని స్వలాభం కోసం వినియోగించుకుంటున్నారన్నారు. ట్రస్ట్ పేరిట ఎవరైనా దుర్వినియోగానికి పాల్పడితే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో ట్రస్టీలు మంద సూర్య ప్రకాశ్, నిమ్మ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతి కేసులో.. నిందితుడి గుర్తింపు

- నాలాలో తోసేసి చంపినట్లు విచారణలో వెల్లడి
- అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 18: జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గాభవానీనగర్ బస్తీకి చెందిన పదేళ్ల బాలుడి మృతి కేసులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బస్తీకి చెందిన మునావత్ కార్తీక్ (10) ఆడుకునేందుకు ఇంట్లోంచి వెళ్లి మంగళవారం రాత్రి అదృశ్యమయ్యాడు. మరుసటి రోజు ఉదయం సమీపంలోని పార్కులో ఉన్న నాలాలో మృతదేహం లభించిన విషయం తెలిసిందే. అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసిన పోలీసులు.. సీసీ పుటేజీ, ఇతర ఆధారాలతో విచారణ ప్రారంభించారు. బాలుడి ఇంటి పక్కనే ఉంటున్న మన్నెం (40) మంగళవారం రాత్రి నుంచి కనిపించడంలేదు. అతడి కోసం నాలుగు రోజుల పాటు గాలించిన పోలీసులు ఆదివారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. మన్నెం అవారాగా తిరుగుతూ.. మద్యం మత్తులో ఉంటాడని, భార్య క్యాన్సర్‌తో చనిపోగా కొడుకుతో కలిసి బస్తీలో ఉంటున్నాడని విచారణలో తేలింది. కార్తీక్ కుటుంబానికి, మన్నెంకు మధ్య గతంలో కొన్ని గొడవలు కూడా జరిగినట్లు విచారణలో తేలింది. మంగళవారం రాత్రి మద్యం మత్తులో బాలుడిని తనతో పాటు పార్కులోకి తీసుకువెళ్లి అనైతిక చర్యలు చేయాలని కోరానని, అందుకు అంగీకరించకపోగా గట్టిగా కేకలు పెట్టడంతో బాలుడిని నాలాలో తోసేయడంతో మృతి చెందాడని నిందితుడు మన్నెం పోలీసుల ఎదుట అంగీకరించినట్లు సమాచారం. దీంతో కార్తీక్ మృతిపై నమోదైన ఐపీసీ 174 సెక్షన్‌ను మార్చి.. ఐపీసీ 302, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదం.. ఇద్దరి మృతి

కందుకూరు. ఫిబ్రవరి 18 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. కందుకూరు పోలీసుల కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని మల్‌చెట్టిగూడ గ్రామానికి చెందిన కాసోజు సుదర్శనాచారి (45) ఆదివారం సాయంత్రం తన బైక్‌పై మీర్‌ఖాన్‌పేట రోడ్డులో వెళ్తున్నాడు. అదేవిధంగా.. యాచారం మండల పరిధిలోని తాటిపర్తి గ్రామానికి చెందిన రమేశ్ (36) కందుకూరు వైపు వెళ్తున్నాడు. అన్నోగూడ గేటు వద్ద ఎదురెదురుగా వచ్చిన వీరి ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. దీంతో ఇరువురికి బలమైన గ్రాయాలు కావడంతో సమాచారం అందుకున్న కందుకూరు పోలీసులు.. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా.. ఇద్దరూ మార్గ మధ్యలో మృతి చెందారు. కందుకూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ బస్సు.. ఆటో ఢీ

బడంగ్‌పేట, ఫిబ్రవరి 18: ఆటోను స్కూల్ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదం హహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లికి చెందిన వెంకటేశ్, ప్రవీణ్ కుమార్, పాండు, శివకుమార్ ఫ్యాసింజర్ ఆటోలో వెళ్తున్నారు. జీఎంఆర్ చిన్మయ స్కూల్‌కు చెందిన బస్సు వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వెంకటేశ్, ప్రవీణ్ కుమార్ పాండు, శివకుమార్‌కు గాయాలయ్యాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని.. గాయపడిన వారిని ఆస్పత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మోసం చేసిన ఎస్సై అరెస్టు

సైదాబాద్, ఫిబ్రవరి 18: పెండ్లి చేసుకుంటానని నమ్మించి.. మోసం చేసిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని బాధిత యువతి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ కథనం ప్రకారం.. సైదాబాద్ లక్ష్మీనగర్ కాలనీకి చెందిన ఓ యువతి (23) 2021లో బంధువుల సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. అక్కడ ట్రైనీ ఎస్ఐగా పనిచేస్తున్న పబ్బా అరుణ్ (29) ఆమెతో మాట్లాడి.. ఫోన్ నంబర్ తీసుకున్నాడు. ఆమెకు ఫోన్ చేసి పరిచయం పెంచుకున్నాడు. వారి స్నేహం ప్రేమకు దారి తీసింది. అప్పటి నుంచి ప్రేమిస్తున్నానంటూ, పెండ్లి చేసుకుంటానని నమ్మించి.. లోబర్చుకున్నాడు. పెండ్లి విషయం ప్రస్తావించగా పట్టించుకోలేదు. అయితే, కొన్ని రోజుల కిందట అతడు మరో యువతితో పెండ్లికి సిద్ధమైనట్లు తెలియడంతో నిలదీసింది. సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో ఎస్ఐగా పనిచేస్తున్న అతడు.. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్నట్లు సమాచారం. పెండ్లి చేసుకుంటానని చెప్పి.. మరో యువతితో నిశ్చితార్థం చేసుకొని తనను మోసం చేసిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలంటూ.. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై అరుణ్‌ను అరెస్ట్ చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు.

నమ్మించి.. లైంగిక దాడి

వెంగళరావునగర్, ఫిబ్రవరి 18: ప్రేమిస్తున్నానంటూ.. పెండ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసి లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కడప జిల్లా మైదుకూరుకు చెందిన చంద్రగుప్తా(30) ఎస్ఆర్ నగర్ ప్రాంతంలో సోదరుడు చాణక్యతో కలిసి ఆయుర్వేద మందుల షాపు నిర్వహిస్తున్నాడు. తన గ్రామానికి చెందిన యువతి (28)ని 2021 నుంచి ప్రేమిస్తున్నాంటూ వెంటపడ్డాడు. పెండ్లి చేసుకుంటానని నమ్మించాడు. యువతి కుటుంబ సభ్యులను కూడా నమ్మించాడు. ఈ కుటుంబాన్ని అమీర్‌పేటలో ఉంచాడు. గత డిసెంబర్ 8వ తేదీన యువతి తల్లి ఇంట్లో లేని సమయంలో చంద్రగుప్తా ఆమె ఇంటికి వచ్చి.. లైంగికదాడికి పాల్పడ్డాడు. మరుసటి రోజు బాధితురాలిని దవాఖానకు తీసుకెళ్లి.. గర్భం రాకుండా బలవంతంగా మందులు వేసుకునేలా చేశాడు. తనను పెండ్లి చేసుకోవాలంటూ యువతి ఎన్నిసార్లు అడిగినా.. కొంతకాలం ఆగాలని సూచించాడు. అనంతరం ముఖం చాటేసి, కనిపించకుండా పోయాడు. చంద్రగుప్తా తల్లిదండ్రులు కూడా బాధితురాలిని, ఆమె తల్లిని బెదిరించడం మొదలు పెట్టారు. దీంతో బాధితురాలు శనివారం ఎస్ఆర్ నగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

BORE WELLS

★శ్రీ వెంకటేశ్వర బోర్‌వెల్స్: 4 1/2 - 800 Fts., 6 1/2 - 2000 Fts., రీబోర్ & ఫ్లషింగ్ రీజనబుల్ ప్రైస్. సంప్ర: శ్రీనివాస్‌రెడ్డి, ఫోన్: 9000193999, 90002 93999. NT-313891

PEST CONTROL

★చెదలు, బొద్దింకలు నివారణ: న్యూ కన్‌స్ట్రక్షన్ ట్రీట్‌మెంట్ 10 సంవత్సరాల గ్యారెంటీ మరియు శానిటైజర్ స్ప్రే కొరకు సంప్ర: 9392468282, 8333030227. NT-319375

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-319697

OLD AGE HOME

★మీన్స్ వృద్ధుల సేవా సంస్థ నందు వృద్ధులకు, బెడ్ పేషెంట్స్‌కు, దీర్ఘవ్యాధులతో ఉన్నవారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24 గం॥ వైద్య, భోజనం, వసతి. ECIL, Hyd. సంప్ర: 9949520296, 7981467036, 9700006699. NT-319830

TOURS & TRAVELS

★మహాదేవ టూర్స్: ప్రతినెల కాశీ యాత్ర, 12/05, 23/05 - చార్‌ధామ్; ★02/07 - అమరనాథ్; ★28/03, 25/04 - ముక్తినాథ్; ★11/04 - రామేశ్వరం; ★25/03 - కామాఖ్య @ 9908844377. NT-313883

HOME TUTIONS

★Home Tutions for Classes upto 10 (CBSE / ICSE / STATE), Intermediate, Degree, BE / B.Tech., IIT & NEET Foundation, Mains & Advanced, Chess by Talented Tutors. Welcome Male, Female Tutors. Contact: Ascent Study Circle, Ph: 9912353330, 9912340561. NT-319715

PLOT FOR SALE

★100 ఫీట్ల రోడ్ ఫేసింగ్‌తో HMDA & RERA వెంచర్ @ ఆదిభట్ల TCS, కొంగరకలాన్ పాక్స్‌కాన్, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు దగ్గరలో విల్లా ప్లాట్లు కలవు. 9052096001. NT-319348

★షాద్‌నగర్ టౌన్‌కి అతి సమీపంలో తక్షణ గృహ నిర్మాణానికి అనువైన DTCP/RERA (LP. 226/2023/H) వెంచర్‌లో అన్ని సదుపాయాలతో డైరెక్ట్ కంపెనీనందు ప్లాట్లు గజం: 7,499/- & 9,999/-. ప్రీ విజిట్‌కై: 8897390163. NT-319813

★షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలో గజం: 15,999/- వేలకే HMDA Approvedతో ఇల్లు కట్టుకోవడానికి రెడీగా ప్లాట్స్ కలవు. మార్కెటింగ్ టీం కావలెను. Ph: +91 9030591797. NT-319386

★JB Serene City* (Phase-3) 267 Sq.yds. & Phase-4 Beside Club House 215 Sq.yds. Commercial & Sulthanpur (RCI Road), Balapur 120 Sq.yd. Plots Sale Call: 9700021777. NT-319839

PLOT FOR SALE

★షాద్‌నగర్ @ కేశంపేట టౌన్‌లో DTCP లేఔట్‌లో ఫుల్ డెవలప్‌మెంట్స్‌తో, 0% ఇంట్రస్టుతో, 20 EMI పద్ధతిలో ఓపెన్ ప్లాట్స్ కలవు. డైరెక్ట్ కంపెనీ ఆఫర్, ఫ్రీ సైట్ విజిట్ కొరకు సంప్ర: 9949695027. NT-319836

★అతి తక్కువ ధరలో ప్లాట్లు... మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు... 121 చ.గజాల ప్లాట్ రూ. 1 లక్ష మాత్రమే పండ్ల మొక్కలతో... ఫ్రీ మెయింటెనెన్స్, స్పాట్